సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



అన్నదానానికి విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి వాడపల్లి శ్రీకాంత్, లక్ష్మిప్రసన్న దంపతులు(మహారాష్ట్ర) శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి సత్య రేయాన్స్ (హైదరాబాద్) శుక్రవారం రూ.2 లక్షల విరాళాన్ని సమర్పించారు.

కాలువలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 4700,మధ్య డెల్టాకు 2200,పశ్చిమ డెల్టాకు 7000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. 2,37,047 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు.

● అందని సాయం.. అందిన వేళ..

అతివల ఆనందహేల

- సర్కారీ మేలుకు సాంకేతిక ప్రతిబంధకాలు
- 111 గ్రూపులకు అందని వైఎస్సార్ ఆసరా
- వారికీ తాజాగా మేలు చేసిన ప్రభుత్వం
- సమస్యలు పరిష్కరించి, ఒకేసారి మూడు విడతల సొమ్ము జమ
- తొలిగా 74 సంఘాలకు రూ.1.66 కోట్ల మేర లబ్ధి



రావులపాలెం మండలం గోపాలపురంలో ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న కొత్తపేట మండలం గంటి గ్రామానికి చెందిన ఎస్‌హెచ్‌జీ సభ్యులు

సాక్షి, అమలాపురం: ప్రజా సంక్షేమమే తొలి ప్రాధాన్యంగా సాగుతున్న రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిట్టచివరి అర్హులకు సైతం మేలు చేస్తోందనడానికి ఇదో నిదర్శనం. సాంకేతిక కారణాలతో వివిధ పథకాలు అందని వారిని గుర్తించి వారికి సైతం సంక్షేమ లబ్ధిని అందిస్తోంది. ఈ క్రమంలోనే వైఎస్సార్ ఆసరా పథకంలో లబ్ధి పొందని గ్రూపులను తాజాగా గుర్తించి, వారి ఖాతాల్లో రుణమాఫీ సొమ్ములు జమ చేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో జిల్లాలోని మహిళా సంఘాలకు లక్షల రూపాయల మేర మేలు జరిగింది.

ఎందుకు లబ్ధి అందలేదంటే...

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 2019 ఏప్రిల్ 11వ తేదీ వరకూ మహిళా స్వయంశక్తి సంఘాల(ఎస్‌హెచ్‌జీ)కు ఉన్న రుణాలను మాఫీ చేస్తానని నాటి ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతలుగా ఈ సొమ్ములను ఆయా ఎస్‌హెచ్‌జీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటి వరకూ మూడు దఫాలుగా అందించారు. అయితే సాంకేతిక కారణాలతో జిల్లాలోని పలు గ్రూపులు ఈ పథకంలో లబ్ధి పొందలేదు. బ్యాంకు అకౌంట్లు తప్పుగా నమోదు చేయడం, ఒక గ్రూపు బదులు అదే పేరు ఉన్న మరో గ్రూపునకు లోన్ ట్యాగ్ కావడం వంటి కారణాలతో సుమారు 111 గ్రూపులకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా అందాల్సిన రుణమాఫీ సొమ్ములు అందలేదు.

ప్రజాప్రతినిధుల చొరవతో..

ఈ నేపథ్యంలో ఆయా సంఘాల సభ్యులు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులు ఈ విషయాన్ని జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు దృష్టికి తీసుకుని వెళ్లారు. వారు ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకు వెళ్లారు. జిల్లాలో ఇలా ఆసరా సొమ్ములు పొందలేని సంఘాలు కొత్తపేట నియోజకవర్గంలో అధికంగా ఉన్నాయి. దీనిని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లారు. ఎందుకు అర్హత పొందలేదో వివరించి, వారికి సైతం ఆసరా లబ్ధి చేకూరేలా కృషి చేశారు. ఈ నేపథ్యంలో సాంకేతిక అవాంతరాలను తొలగించి, వారికి కూడా మేలు చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లాలోని 74 సంఘాలకు మూడు విడతలుగా అందాల్సిన ఆసరా సొమ్ములు ఒకేసారి అందాయి. ఆయా సంఘాల పరిధిలోని సుమారు 750 మంది సభ్యులకు నాలుగు విడతలుగా రూ.2,30,78,480 ఇవ్వాల్సి ఉండగా, రూ.1,66,78,642 ఖాతాల్లో జమవుతున్నాయి.



అంబాజీపేట మండలం వాకగలరువుకు చెందిన శ్రీరామ ఎస్‌హెచ్‌జీ సభ్యులు

త్వరలో మరో 37 గ్రూపులకూ మేలు

సాంకేతిక కారణాలతో వైఎస్సార్ ఆసరా అందని **సంఘాల్లో 74** గ్రూపులకు ప్రభుత్వం **నిధులు విడుదల** చేయగా, మిగిలిన 37 **గ్రూపులకు త్వరలో** సొమ్ములు జమ చేయనుంది. **అత్యధికంగా కొత్త**పేట నియోజకవర్గ పరి**ధిలో 42 సంఘాల** పరిధిలోని 426 మంది **సభ్యులకు రూ.92,82**,385 విడుదల కావడం **విశేషం. ఈ నియోజక**వర్గ పరిధిలోని కొత్తపేట **మండలం గంటి, వాడ**పాలెం, రావులపాలెం **మండలం ఊబలంక**, వెదిరేశ్వరం, ఆత్రేయ**పురం మండలం ర్యాలి** గ్రామాల్లోని ఎహెచ్‌జీలు అధికంగా లబ్ధి పొందాయి. మండపేట నియోజకవర్గ పరిధిలోని కపిలేశ్వరపురం మండలం అంగర, పరమర ఖండ్రిక, మండపేట మండలం ఏడిదలోని ఎస్‌హెచ్‌జీ గ్రూపులకూ లాభం చేకూరింది.

వైఎస్సార్ ఆసరా మూడు విడతల సొమ్ము అందిందిలా.. (రూ.లలో)

నియోజకవర్గం	ఎస్‌హెచ్‌జీలు	లబ్ధి పొందే సభ్యులు	అందాల్సిన ఆసరా సొమ్ములు	మూడు విడతలుగా అందిన సొమ్ములు
మండపేట	16	161	50,72,601	33,81,459
కొత్తపేట	42	426	1,26,52,828	92,82,385
రాజోలు	2	21	8,48,968	6,36,729
పి.గన్నవరం	7	70	24,96,979	18,72,738
రామచంద్రపురం	4	41	11,26,599	8,44,950
ముమ్మిడివరం	2	21	8,80,505	6,60,381
మొత్తం	74	750	2,30,78,480	1,66,78,642

మూడు విడతల ఆసరా రూ.3.78 లక్షలు వచ్చింది



మా గ్రూపునకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రావాల్సిన డ్వాక్రా రుణమాఫీ సొమ్ము జమ కాలేదు. అధికారులను అడిగితే సాంకేతిక లోపం అన్నారు. విషయాన్ని మా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి చెప్పగా ఆయన సీఎం జగన్ దృష్టికి తీసుకుని వెళ్లారు. మా గ్రూపునకు మూడు విడతలుగా రావాల్సిన రూ.3.78 లక్షలు జమ అయ్యాయి. మా సమస్యను పరిష్కరించిన సీఎం జగన్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు.

– చామకూరి కామాక్షి, అధ్యక్షురాలు, యువతరం డ్వాక్రా గ్రూపు, గంటి, కొత్తపేట మండలం

రావనుకున్న సొమ్ములు వచ్చాయి



మూడు విడతలుగా ఆసరా సొమ్ములు రాకపోతే ఇక మాకు రావనుకున్నాం. ఈ సమయంలో మా గ్రూపునకు ఒకేసారి మూడు విడతల సొమ్ములు రూ.4.67 లక్షలు రావడం చాలా సంతోషంగా అనిపించింది. ప్రభుత్వం మాకు పలు సంక్షేమ పథకాల ద్వారా మేలు చేస్తోంది. ఆసరా సొమ్ములు కూడా విడుదల చేసి ఆదుకుంది.

– మేడేపల్లి నాగమణి, పడాల నాగలక్ష్మి, అధ్యక్ష కార్యదర్శులు, గాయత్రీ ఎస్‌హెచ్‌జీ, అంగర, కపిలేశ్వరపురం మండలం

మిగిలిన వారికీ త్వరలో..



వైఎస్సార్ ఆసరా పొందలేని మిగిలిన సంఘాలకు కూడా త్వరలో సొమ్ములు విడుదలయ్యే అవకాశముంది. వివిధ సాంకేతిక కారణాలతో ఆసరా సొమ్ములు అందని ఎస్‌హెచ్‌జీలకు వాటిని అందించేందుకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు విశేష కృషి చేశారు. వారు స్వయంగా కలగజేసుకోవడంతో ప్రభుత్వం నుంచి మూడు విడతల సొమ్ములు ఒకేసారి మంజూరయ్యాయి.

– డాక్టర్ వి.శివశంకర్ ప్రసాద్, పీడీ, డీఆర్‌డీఏ

న్యూస్‌రీల్

250 మందికి గెయిల్ ఉచిత శిక్షణ

మామిడికుదురు: స్థానిక డాక్టర్ బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలోని గెయిల్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ద్వారా ఈ ఏడాది 250 మందికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. గెయిల్ ట్రైనీ ఇన్‌చార్జి ఎ.సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఉచిత శిక్షణకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, ఇండస్ట్రియల్ వెల్డర్, డ్రాఫ్ట్స్‌మన్ మెకానికల్, డేటా ఎంట్రీ ఆపరేటర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ ట్రైనీ (నర్సింగ్) కోర్సులకు శిక్షణ ఇస్తామని వివరించారు. ఈ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభించామని, శిక్షణ పొందగోరే అభ్యర్థులు 8897 9990 99 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. గత ఏడాది 180 మంది ఉచిత శిక్షణ పొందారని, వారిలో 151 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. 2015 నుంచి ఇప్పటి వరకూ 1,349 మంది శిక్షణ పొందారని, వారిలో 942 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించామని సురేష్ పేర్కొన్నారు.

పాఠశాలకు రూ.1.50 లక్షల విరాళం



బాస్కెట్‌బాల్ కోర్టుకు భూమి పూజ చేస్తున్న దాత

ఐ.పోలవరం: తాము చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు రూ.1.50 లక్షల విరాళం అందించారు. ఐ.పోలవరం జెడ్పీ హైస్కూలులో చదువుకున్న కుడుపూడి శ్రీనివాస్, పడాల వెంకట శ్రీరామారావు, బులుసు వీరేంద్రబాబు ప్రస్తుతం యూఎస్‌ఏలో స్థిరపడ్డారు. తమ పాఠశాలలో బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మాణానికి గాను హెచ్‌ఎంకు శుక్రవారం ఈ విరాళం అందజేశారు. బాస్కెట్‌బాల్ కోర్టు స్తంభాలకు కుడుపూడి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. దాతను పీఏసీఎస్ చైర్మన్ రేవు సొరెడ్డి తదితరులు అభినందించారు.

భూగర్భ జల కాలుష్యం నివారణకు చర్యలు: ఎమ్మెల్సీ



కుడుపూడి సూర్య నారాయణరావు

అమలాపురం టౌన్: కృష్ణా గోదావరి (కేజీ) బేసిన్‌లో భూగర్భ జల కాలుష్య నివారణకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సహజవాయువు వెలికితీత కార్యకలాపాలతో కృష్ణా గోదావరి (కేజీ) బేసిన్‌లో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, దీనిపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటో తెలపాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నించారు. భూగర్భ జల కాలుష్యంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పర్యావరణం దెబ్బ తింటోందని తెలిపారు.

బాలల సైన్స్ కాంగ్రెస్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ కమల కుమారి తదితరులు

ముమ్మిడివరం: అక్టోబర్ చివరి వారంలో జరిగే 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను డీఈఓ కమల కుమారి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరోగ్యం – సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యాన బాలల సైన్స్ కాంగ్రెస్ జరుగుతుందని తెలిపారు. దీనికి సంబంధించిన ఓరియెంటేషన్ తరగతులు ఈ నెల 29, 30 తేదీల్లో రామచంద్రపురం, అమలాపురం డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేశామని చెప్పారు. పై అంశాల ఆధారంగా ఆరు నుంచి 14 సంవత్సరాల వయస్సు గల విద్యార్థినీ విద్యార్థులు వివిధ ప్రాజెక్టులు తయారు చేసి, ప్రదర్శించాలని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బీవీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

26న మెగా జాబ్ మేళా

అమలాపురం రూరల్: ఈ నెల 26న రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోక్‌మాన్ తెలిపారు. ఈ మేళాలో 13 సంస్థలు పాల్గొంటాయని, 800 పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వివరించారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మా చదివిన వారు ఈ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. వివరాలకు చక్రధర్‌ను 96031 61039 లేదా ట్రోల్ ఫ్రీ నంబర్ 99888 53335లో సంప్రదించాలని లోక్‌మాన్ సూచించారు.

లాభదాయకమైన ఆక్వా సాగుపై శిక్షణ

అల్లవరం: ఆక్వా సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ ఆక్వాకల్చర్ (నాక్సా) రీజినల్ కో ఆర్డినేటర్ ఎన్‌పీ చంద్రశేఖర్ అన్నారు. స్వయం సహాయక సొసైటీల జీవనోపాధి, అంతర్జాతీయ మార్కెట్‌లో స్థిరమైన ఆహార భద్రత కల్పించడంపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అల్లవరం మండలం తూర్పులంక గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఆక్వా రైతులకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. నాక్సా ప్రతినిధులు మాట్లాడుతూ, 10 నుంచి 75 మంది వరకూ ఎస్సీ, ఎస్టీ ఆక్వా రైతులు సంఘాలుగా ఏర్పడి ఎంపెడాలో రిజిస్టర్ కావాలన్నారు. ఆ సంఘాలకు ఆక్వా సాగుకు అవసరమైన విద్యుత్, ఏరియేటర్ల వంటి మౌలిక సౌకర్యాల కల్పనకు 75 శాతం సబ్సిడీతో రూ.30 లక్షల వరకూ అందిస్తామని తెలిపారు. వనామీకి ప్రత్యామ్నాయంగా పండుగొప్ప, పసుపు పీత, గిఫ్ట్ తిలాపియా, కొయింగ చేపల పెంపకం చేపట్టి, మంచి లాభాలు పొందవచ్చని చెప్పారు. కాకినాడ తీరంలో ప్రభుత్వ అనుమతులు పొందిన మూడు హేచరీల నుంచి చేప పిల్లలు ఉత్పత్తి చేస్తున్నారన్నారు. రైతులు సాగు చేసిన చేపలను మార్కెట్ చేసుకోవడానికి ఈ–సంత ద్వారా సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీ (ఎంపెడా) తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న రైతులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో నాక్సా కో ఆర్డినేటర్ ఎస్.బాలాజీ, ఎంపెడా ఎఫ్‌టీఓ బి.నూకేష్, ఫీల్డ్ మేనేజర్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆక్వా రైతులకు శిక్షణ ఇస్తున్న నాక్సా రీజినల్ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్

జీవ నియంత్రణ పద్ధతులతో తెగుళ్ల నివారణ

అంబాజీపేట: జీవ నియంత్రణ పద్ధతులతోనే కొబ్బరిపై తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందని స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు అన్నారు. పరిశోధన కేంద్రాన్ని ఎఫ్‌పీఓ బోర్డు సభ్యులు, మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, తమిళనాడుల్లో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్లు శుక్రవారం సందర్శించారు. వారికి ఇక్కడ జరుగుతున్న పరిశోధనలు తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కొబ్బరి రకాలు, గుణగణాలు, నాణ్యమైన మొక్కల ప్రవర్ధనం, అధిక దిగుబడులకు సమగ్ర సేద్య పద్ధతులు, అధిక ఆదాయానికి కొబ్బరిలో వేసుకోదగిన అంతర పంటలు తదితర విషయాలను ఉద్యాన విభాగ శాస్త్రవేత్త ఎ.కిరీటి వివరించారు. కీటక విభాగంలో పరాన్న జీవుల ఉత్పత్తి, జీవ నియంత్రణ పద్ధతి ద్వారా తెల్లదోమ, నల్లముట్టి, కొమ్ము పురుగుల నివారణ చర్యలపై కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూష అవగాహన కల్పించారు. బూజు జాతి సూక్ష్మ జీవ నియంత్రణ కారకాలైన ట్రైకోడెర్మా స్పీసిస్‌లను ఉపయోగించి కొబ్బరిని ఆశించే గానోడెర్మా, నల్లమచ్చ, మొవ్వుకుళ్లు తెగుళ్లను అరికట్టే విధానాలను తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు వివరించారు. అనంతరం వారికి కొబ్బరిలో ఎరువులు వేయడం, తెగుళ్లను అరికట్టడానికి జీవ శిలీంద్రాల వినియోగం, తెల్లదోమ, వివిధ కీటకాలను బదనికల ద్వారా నివారించడంపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు.



కేంద్రంలో పరిశోధనలను నాఫెడ్ అసిస్టెంట్ మేనేజర్లకు వివరిస్తున్న చలపతిరావు, శాస్త్రవేత్తలు

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా వ్యాయామోపాధ్యాయులు కృషి చేయాలని జేఎన్‌టీయూకే ఉపకులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యాన 15వ అనుబంధ కళాశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకుల సర్వసభ్య సమావేశం వర్సిటీలో శుక్రవారం నిర్వహించారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో వినూత్న మార్పులు తీసుకువస్తున్నామని, క్రీడాకారులకు 0.5 క్రెడిట్స్ కేటాయిస్తున్నామని తెలిపారు. కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్, ఇంటర్ కాలేజియేట్ టోర్నీల కార్యదర్శి జీపీ రాజు క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు క్రెడిట్స్ ఎలా విభజించాలి, ఏవిధంగా మూల్యాంకనం చేయాలో అవగాహన కల్పించారు. అంతర్ కళాశాలల క్రీడల్లో ప్రతిభ చూపిన వ్యాయామోపాధ్యాయులను రిజిస్ట్రార్ సుమలత ఆధ్వర్యంలో సత్కరించారు. ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, అనుబంధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఆరోగ్య భరోసా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీసీహెచ్‌ఓ పద్మశ్రీరాణి, డీఎంహెచ్‌ఓ దుర్గారావుదొర

- ఈ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి
- డీసీహెచ్‌ఓ పద్మశ్రీరాణి ఆదేశం

సాక్షి, అమలాపురం: పేదలకు ఆరోగ్య భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఓ) పద్మశ్రీ రాణి అన్నారు. అమరావతి నుంచి వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్‌లు శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ సర్వే పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులు సమీక్షించారు. అనంతరం పద్మశ్రీరాణి మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్యపరమైన అవగాహన కల్పించడంతో పాటు వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని సేవలందించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఏఎన్‌ఎంలు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు రెండు బృందాలుగా ఏర్పడి, ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యశ్రీ సేవల వివరాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇంట్లో ఆరోగ్య సమస్యలపై ఆరా తీసి, సాధారణ ప్రాథమిక ఆరోగ్య పరీక్షలతో పాటు రక్తహీనత, రక్తపోటు, మధుమేహం, డెంగీ, మలేరియా, క్షయ వ్యాధి సంబంధిత ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని పద్మశ్రీరాణి ఆదేశించారు. ఈ వివరాలను నమోదు చేసి, ఏఎన్‌ఎం యాప్‌లో అప్‌లోడ్ చేస్తూ టోకెన్ జనరేట్ చేయాలని సూచించారు. ఆరోగ్యశ్రీ అనుబంధ ఆసుపత్రుల జాబితాతో కూడిన వివరాలు అందించి, ఆయా వైద్య సేవలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన పెంపొందించాలని చెప్పారు. వైద్య శిబిరాల నిర్వహణ సమయానికి వారి హెల్త్ రిపోర్ట్ సిద్ధం చేయాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజూ ప్రతి మండలంలో ఏదో ఒక వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌తో పాటు ప్రతి పట్టణంలోనూ ఏదో ఒక వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ వైద్య శిబిరాలు నిర్వహించాలని పద్మశ్రీరాణి చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ఎం.దుర్గారావుదొర, అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ ఒ.భరతలక్ష్మి, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ సుమలత, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ ఆడ్రోస్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం
- కలెక్టరేట్‌లో విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్, ఇతర అధికారులు

సాక్షి, అమలాపురం: షెడ్యూల్ కులాల, తెగల అత్యాచారాల నిరోధక చట్టం కింద నమోదైన కేసులను సత్వరమే పరిష్కరించేందుకు న్యాయ, పోలీసు, రెవెన్యూ, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. పౌర హక్కుల రక్షణ, ఎస్సీ, ఎస్టీలపై దాడుల నియంత్రణపై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ, సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎస్సీ, ఎస్టీలు సమాన అవకాశాలు పొందేందుకు, సామాజిక న్యాయ కల్పనకు, అగ్రవర్ణాల అత్యాచారాల నుంచి రక్షణ కల్పించేందుకు ఈ చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని అన్నారు. ఉన్నతి పథకం ద్వారా వివిధ యూనిట్లు మంజూరు చేస్తూ ఎస్సీ, ఎస్టీ నిరుపేదల జీవన ప్రమాణాలు పెంచాలని సూచించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు అనుగుణంగా యూనిట్లు మంజూరు చేయాలన్నారు. జిల్లా నీటి యజమాన్య సంస్థ ద్వారా గ్రామాలకు దూరంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ ఆవాసాలకు అప్రోచ్ రోడ్లు వేయాలని, శ్మశానవాటికలకు అనుసంధాన రోడ్లు ఏర్పాటు చేయాలని, దీనికి మండల ప్రణాళికలో కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వారి నివాసాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న బడుగు వికాసం ద్వారా రాయితీలతో యూనిట్లు గ్రౌండ్ చేస్తూ ఆయా వర్గాలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని జిల్లా పరిశ్రమల శాఖకు సూచించారు. వసతి గృహాల్లో ప్రతి నెలా వైద్య శిబిరాలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలని కలెక్టర్ శుక్లా ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీలపై అత్యాచార నేరాలకు పాల్పడిన వారిపై పూర్తి స్థాయిలో కేసులు నమోదు చేసి, విచారణ జరిపించి, బాధితులకు న్యాయం చేకూర్చాలని అన్నారు. నిజమైన బాధితులకు న్యాయం జరిగినప్పుడే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం నెరవేరుతుందని చెప్పారు. అత్యాచార నిరోధక చట్టం కింద బాధితుల ఉపశమనం, సామాజిక, ఆర్థిక పునరావాస కల్పనను జిల్లా యంత్రాంగం విధిగా భావించాలన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 108 కేసులు నమోదు కాగా, 104 కేసులు ప్రాసెస్‌లో ఉన్నాయని, వీటికి సంబంధించి ఎఫ్‌ఐఆర్ దశలో 49 కేసులకు రూ.17.25 లక్షలు, చార్జిషీటు దశలో 52 కేసులకు రూ.48.12 లక్షలు, పోస్టుమార్టం, మెడికల్ ఎగ్జామినేషన్ దశలో మూడు కేసులకు రూ.12.37 లక్షల చొప్పున మొత్తం రూ.77.75 లక్షలు నష్ట పరిహారంగా మంజూరైందని కలెక్టర్ వివరించారు.

నిమజ్జనానికి పటిష్ట చర్యలు

గణేశ నిమజ్జనాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా ఘాట్‌ల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శుక్లా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. నిమజ్జనం చేపట్టే ఘాట్ల వద్ద ఎంపీడీఓల సమన్వయంతో లైటింగ్ ఏర్పాటు చేయాలని, భక్తుల రక్షణకు గజ ఈతగాళ్లను నియమించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి పి.జ్యోతి లక్ష్మీదేవి, డీఎస్పీలు అంబికా ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గణపతి లడ్డూ రూ.66,000



రూ.66 వేలు పలికిన గణపతి లడ్డూతో ప్రిన్స్ యూత్ సభ్యులు

అయినవిల్లి: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పోతుకుర్రు గ్రామంలో గణేశునికి సమర్పించిన లడ్డూకు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం వేలం వేశారు. ఈ లడ్డూను ప్రిన్స్ యూత్ సభ్యులు రూ.66 వేలకు దక్కించుకున్నారు. వీరిని గ్రామస్తులు అభినందించారు.

దాడి చేసి గాయపరచిన వ్యక్తికి ఏడాది జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఒక మహిళపై దాడి చేసి గాయపరచిన ఘటనలో స్థానిక క్వారీ పేటకు చెందిన మరో మహిళ లచ్చిరెడ్డి నాగబాలకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ రెండో అదనపు కోర్టు జడ్జి ఎ.కృష్ణప్రసాద్ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలివీ.. మంగళవారపుపేటకు చెందిన లచ్చిరెడ్డి దుర్గకు, క్వారీ పేటకు చెందిన నాగబాలకు కుటుంబ తగాదాలు ఉన్నాయి. 2018 ఏప్రిల్ నాలుగో తేదీన దుర్గ ఇంటికి నాగబాల వచ్చి సిమెంటు రాయితో తలపై కొట్టింది. దీనిపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ అనంతరం న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఏపీపీ ఎస్.విజయ్‌కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. సాక్ష్యాలను సక్రమంగా ప్రవేశపెట్టిన వన్‌టౌన్ సీఐ లక్ష్మణరావు, కోర్టు కానిస్టేబుల్ విజయ్‌రాజును ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

కూరగాయల వ్యాపారి అనుమానాస్పద మృతి

యానాం: పట్టణంలోని విష్ణాలయం వీధిలో కూరగాయల వ్యాపారి మాగాపు వీరబాబు (55) గురువారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాడు. సీఐ షణ్ముగం, ఎస్సై శేరు నూకరాజు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. వీరబాబు తన కూరగాయల షాపులోనే ఫ్యాన్‌కు వేసిన ఉరికి వేలాడుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వీరబాబు మృతి పట్ల ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తదితరులు సంతాపం తెలిపారు.

కొత్త ముప్పు.. ముందుచూపు





వార్డులో సిద్ధం చేస్తున్న పడకలు

- కలవరపెడుతున్న నిపా వైరస్
- ఈ మహమ్మారిపై యుద్ధానికి సిద్ధమవుతున్న ప్రభుత్వం
- కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు
- ఆక్సిజన్ సరఫరాతో 27 పడకలు
- ఆరుగురు వైద్యులతో పర్యవేక్షక బృందం
- కోవిడ్ అనుభవంతో కట్టుదిట్టంగా ఏర్పాట్లు

కాకినాడ క్రైం: ప్రపంచం 'ఊపిరి' అర్ధాంతరంగా స్తంభించిపోయిన దయనీయ దారుణమది. ఊహకందని రీతిలో వ్యాప్తి చెందిన కోవిడ్.. లెక్కకు మిక్కిలిగా ప్రాణాలు తోడేసింది. నాలుగేళ్ల నాటి కరోనా మహమ్మారి మిగిల్చిన కన్నీటి చారికలు చెరిగిపోక ముందే మరో మహమ్మారి భయపెడుతోంది. నిపా పేరుతో మరో ప్రమాదం ముంచుకొస్తోంది. ఈ వైరస్ బారిన పడిన వారిలో మరణాల (మోర్టాలిటీ) రేటును ప్రపంచ ఆరోగ్య సంస్థ 75 శాతంగా నిర్ధారించడం, వ్యాక్సిన్ సిద్ధం చేసేందుకు అత్యయిక స్థితి ప్రకటించడం ఆందోళన కలిగిస్తున్న అంశాలు. అయితే ప్రభుత్వాలు, వైద్య నిపుణులు భయం లేదంటూ భరోసా ఇవ్వడం ఓ సానుకూల అంశం. అందుకు తగినట్టుగానే ప్రభుత్వం ముందుచూపుతో సంసిద్ధమవుతోంది.

సమగ్రంగా..

గబ్బిలాలు, పందుల వల్ల నిపా వైరస్ వ్యాప్తి చెందుతుంది. దీనిని మలేషియాలో 1999లో పందులు పెంచే వర్గాల్లో గుర్తించారు. పశ్చిమ బెంగాల్ సహా అస్సాం, ఉత్తర ఈశాన్య రాష్ట్రాల్లో ఈ వైరస్ తన ఉనికిని చాటుకుంది. 2018లో కేరళలో ప్రవేశించింది. అదే ఏడాది మామిడి పండ్లు తిన్న 18 మంది అంతు చిక్కని కారణంతో చనిపోవడం సంచలనం రేపింది. నిపా వైరస్ సోకిన గబ్బిలాలు కొరికిన మామిడి పండ్లు తినడం వల్ల వారందరూ చనిపోయారని వైద్య పరీక్షల్లో తేలింది. 2021లోనూ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఈ నెలలోనే కేరళ రాష్ట్రంలో ఇద్దరు చనిపోయారు. వారిలో తొమ్మిదేళ్ల బాలుడు ఉండటం కలవరపెడుతోంది. కోవిడ్ కూడా దేశంలో తొలిసారి కేరళ కేంద్రంగానే విజృంభించి, యావత్ దేశంలో ప్రతి మూలా వ్యాప్తి చెందిన విషయం అందరికీ తెలిసిందే.

త్వరలో ట్రూనాట్ కిట్లు

నిపా వైరస్ అనుమానితుల నుంచి సేకరించిన శాంపిళ్లను పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ పరిధిలోని బయోసేఫ్టీ లెవెల్-4 ల్యాబ్‌లో పరీక్షిస్తారు. అయితే కాకినాడ జీజీహెచ్‌లో ట్రూనాట్ మెషీన్లు అందుబాటులో ఉన్నందున ట్రూనాట్ కిట్లను జీజీహెచ్‌కు సమకూర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా స్థానికంగానే ప్రాథమిక పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ట్రూనాట్ కిట్లకు ఆర్డర్ చేశారు. త్వరలో ఇవి జీజీహెచ్‌కు చేరుకోనున్నాయి.

మందులు సిద్ధం

నిపా వైరస్‌కు టీకా లేకపోయినా లక్షణాల ఆధారిత వైద్యం కోసం జీజీహెచ్ అధికారులు అన్ని రకాల మందులూ సిద్ధం చేస్తున్నారు. పలు పరిశోధనల ఆధారంగా వైరస్ తీవ్రతను తగ్గించి, బాధితుడి ప్రాణాలు నిలిపేందుకు అవసరమైన రెమిడెసివీర్ ఇంజక్షన్లు, ఫావీపవీర్, రిబావిరిన్ మాత్రలకు ఇండెంట్ సిద్ధం చేశారు. అలాగే లక్షణాల ఆధారంగా ఇచ్చే మాత్రలు, శ్వాసకోశ సంబంధిత చికిత్సకు ఉపయోగించే మందులు తగినన్ని ఉన్నాయని జీజీహెచ్ గ్రేడ్-1 ఫార్మసిస్టు పసుపులేటి శ్రీనివాస్ తెలిపారు.



నిపా బాధితుల చికిత్సకు జీజీహెచ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్డు

పది రెట్లు అధికంగా ఆక్సిజన్

జీజీహెచ్‌లో ఆక్సిజన్‌కు ఏమాత్రం లోటు లేదు. ఆసుపత్రిలో మూడు లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ ప్లాంట్లు ఉన్నాయి. వాటిలో 20 కిలోలీటర్లవి 2, 10 కిలోలీటర్లవి 1 వినియోగంలో ఉన్నాయి. ఇవి కాకుండా అపెక్స్ సంస్థ అందించిన 20 కిలోలీటర్ల ఆక్సిజన్ ప్లాంట్ సిద్ధంగా ఉంది. అత్యవసరమైతే ఈ ప్లాంటును వినియోగిస్తారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో రోజుకు 3 కిలోలీటర్ల ఆక్సిజన్ వినియోగం అవుతుండగా.. అంతకు పది రెట్లు అంటే 30 కిలోలీటర్ల వరకూ ఆక్సిజన్ సరఫరా చేయగలిగే సామర్థ్యం మూడు ప్లాంట్లకు ఉంది. కోవిడ్ అంతటి విపత్కర స్థితిలోనే గరిష్టంగా రోజుకు 18 కిలోలీటర్ల ఆక్సిజన్ మాత్రమే వినియోగమైంది.

సిద్ధంగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీం

డీఎంఈ ఆదేశాల మేరకు జీజీహెచ్‌లో ఆరు విభాగాలకు చెందిన నిపుణులతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం కూడా సిద్ధమైంది. వీరు జీజీహెచ్‌లో నిపా కేసులు, బాధితులకు అందుతున్న వైద్య సేవలు, వారి స్థితిగతులను అనునిత్యం పర్యవేక్షిస్తాంస్తుంటారు. సూపరింటెండెంట్ ద్వారా తాజా పరిస్థితిని రాష్ట్ర విభాగానికి నివేదిస్తారు. డాక్టర్ వింధ్య (ప్రొఫెసర్, అనస్థీషియా), డాక్టర్ జి.రమ్య (నోడల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పల్మనాలజీ), డాక్టర్ ఎస్ఎం షరీఫ్ (అసోసియేట్ ప్రొఫెసర్, న్యూరాలజీ), డాక్టర్ ప్రశాంతి (అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్డియాలజీ,), డాక్టర్ సూర్యకాంత్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్), డాక్టర్ ఎం.వెంకట రమణ (అసిస్టెంట్ ప్రొఫెసర్, మైక్రోబయాలజీ)లతో ఈ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమును సిద్ధం చేశారు.

జీజీహెచ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశం, రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) ఆదేశాలతో నిపా వైరస్ నియంత్రణ, చికిత్సకు కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి మార్గదర్శకాలు నిర్దేశిస్తూ డీఎంఈ రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జీజీహెచ్ ఈఎన్‌టీ భవనంలో 27 పడకలతో నిపా వైరస్ ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. ప్రతి పడకకూ ఐసీయూ స్థాయి ఆక్సిజన్ సరఫరా ఏర్పాటు చేశారు. వీరికి వైద్య సేవలు అందించేందుకు పల్మనాలజీ, జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, న్యూరాలజీ, ఈఎన్‌టీ నిపుణులను సిద్ధం చేశారు. పారామెడికల్, నర్సింగ్, శానిటేషన్ సిబ్బందినీ నియమించారు. నిపా బాధితులకు తగిన సేవలు అందించడంలో వీరికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

ఏం భయం లేదు



నిపా వైరస్ బాధితులు వచ్చినా.. వారిని రక్షించేందుకు జీజీహెచ్‌లో అన్ని ఏర్పాట్లూ ఉన్నాయి. ర్యాపిడ్ రెస్పాన్స్ టీం కీలకంగా వ్యవహరిస్తుంది. మందుల నుంచి ప్రాణవాయువు వరకూ లోటు లేదు. వైరస్ స్థాయి ఎలా ఉన్నా బాధితుల ప్రాణానికి ముప్పేమీ లేదు. జీజీహెచ్‌లో అన్ని ఏర్పాట్లూ చేశాం. కలెక్టర్ నేరుగా పర్యవేక్షిస్తారు. ఆమెతో కలసి రాష్ట్ర స్థాయికి నివేదిస్తున్నాం. సాధారణ ఫ్లూ లక్షణాలేనన్న నిర్లక్ష్యం వద్దు. వైద్య నిపుణుల్ని సంప్రదించాలి.

– డాక్టర్ సరెళ్ల లావణ్యకుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

మళ్లీ మాస్క్



లక్షణాల ఆధారంగానే నిపా వైరస్ బాధితులకు చికిత్స అందిస్తాం. వైరస్ కావడంతో మందులు లేవు. టీకా తయారీకి పరిశోధనలు కీలక దశలో ఉన్నాయి. గబ్బిలాల నుంచి వచ్చినా వ్యాప్తి మాత్రం మనుషుల ద్వారానే జరుగుతుంది. లాలాజలం, తుంపర్లు, శరీర ద్రవాల నుంచి వ్యాప్తి చెందే అవకాశం ఉంది. జ్వరం, తలనొప్పి, మత్తు నిపా వైరస్ ప్రధాన లక్షణాలు. శ్వాసకోశాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. కోవిడ్ తరహాలోనే మాస్క్ ధరించడం, శానిటైజర్ వాడటం, సామాజిక దూరం పాటించడం అత్యవసరం.

– డాక్టర్ వి.సూర్యకుమారి, పల్మనాలజీ విభాగాధిపతి, జీజీహెచ్, కాకినాడ

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

మధురపూడి: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి సేవలందించాలని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సైంటిఫిక్ సలహాదారు, శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్ రెడ్డి ఆకాంక్షించారు. కోరుకొండ మండలం గాడాలలోని లారెల్ హై గ్లోబల్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన విజ్ఞాన ప్రదర్శనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశానికి విద్యార్థులు రేపటి భవిష్యత్ అని అన్నారు. రక్షణ రంగ ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రతి విద్యార్థీ చదువులో నూతన ఆవిష్కరణల ద్వారా మేధోశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు ప్రయోగాలను పరిశీలించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. స్కూల్ ప్రాంగణంలో సతీష్‌రెడ్డి మొక్క నాటారు. కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, కరస్పాండెంట్ సుంకర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న సతీష్‌రెడ్డి

పొగాకు, ఇతర పంటలపై పరిశోధనలు

- సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషమాధవ్
- పరిశోధన కమిటీ సమావేశాలు ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: పొగాకుతో పాటు వాణిజ్య పంటలైన పసుపు, మిరప, అశ్వగంధ, ఆముదం వంటి పంటలపై కూడా పరిశోధనలు చేపట్టాల్సి ఉంటుందని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్ఐ) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషమాధవ్ అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే పరిశోధన కమిటీ సమావేశాలను సీటీఆర్ఐ సెమినార్ హాలులో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భవిష్యత్ పరిశోధనల నిర్వహణపై తొలి రోజు సుదీర్ఘ చర్చలు జరిగాయని, ఇది ఒకవిధంగా పరిశోధనా రంగంలో ఆడిట్ వంటిదేనని అన్నారు. వివిధ రకాల వంగడాలను ప్రవేశపెట్టి, పొగాకు జెర్మ్ ప్లాస్మ్ సంరక్షణ, పర్యవేక్షణలో తమదైన ముద్ర వేశారని చెప్పారు. గత సంవత్సరం ఐదు వంగడాలను విడుదల చేశామన్నారు. ట్యాపింగ్ టూల్, పొగాకు బేళ్ల ప్రెస్సింగ్, పొగాకు ఆకులు కుట్టే, నాట్లు వేసే యంత్రాలు, పోలీ ట్రే ప్రెస్సింగ్ టూల్ వంటి వాటిపై విస్తృత పరిశోధనలు జరిగాయని డాక్టర్ శేషమాధవ్ చెప్పారు. ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీలో ముందంజ వేశామన్నారు. పొగాకు అగ్రి దక్ష, డిజిటల్ ఫీల్డ్ నోట్ బుక్ వంటి అనేక సాఫ్ట్‌వేర్‌లను, రైతుల ప్రయోజనార్థం సీడ్ పోర్టల్ వంటి అప్లికేషన్లను రూపొందించామని తెలిపారు. డిజిటల్ లావాదేవీల ద్వారా రూ.1.80 కోట్ల విలువైన విత్తనాలను రైతులకు అందించామని చెప్పారు. పొగాకు బోర్డు, సీఎస్ఐఆర్, నన్నయ యూనివర్సిటీ, తమిళనాడు అగ్రికల్చరల్ యూనివర్సిటీ వంటి వాటితో అవగాహన ఒప్పందాలు చేసుకున్నామని డాక్టర్ శేషమాధవ్ తెలిపారు. ఈ సమావేశాల్లో హైదరాబాద్‌లోని ఐసీఏఆర్, ఐఐఓఆర్ నూనె గింజల పరిశోధన సంస్థ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుజాత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పంటల అభివృద్ధి విభాగానికి జెనెటిక్స్ ఎక్స్‌పర్ట్‌గా సీటీఆర్ఐ పూర్వ డైరెక్టర్ డాక్టర్ టీజీకే మూర్తి, మెంబర్ సెక్రటరీగా డాక్టర్ ఎం.అనురాధ, సమన్వయకర్తగా సీటీఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్ కె.సుమన్ కల్యాణి వ్యవహరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషమాధవ్

హత్య కేసులో మరో ముగ్గురి అరెస్టు

అమలాపురం రూరల్: ఈదరపల్లిలో ఈ నెల 1న జరిగిన రౌడీషీటర్ పోలిశెట్టి రామకృష్ణ (కిషోర్) హత్య, అతడితో ఉన్న అడపా సాయిపై హత్యాయత్నం కేసులో మరో ముగ్గురిని పోలీసులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కొంకాపల్లి చెందిన రౌడీషీటర్ ఇందుగుల ఆనంద్‌కుమార్ (ఆనంద్), అల్లవరం మండలం గూడాల చెందిన మేడిద వెంకట రామకృష్ణ (దొరబాబు), నూకల వెంకటేష్ ఉన్నారు. వీరి నుంచి ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ అంబికా ప్రసాద్ శుక్రవారం ఈ వివరాలు తెలిపారు. ఈ ముగ్గురితో కలిపి ఈ కేసులో ఇప్పటి వరకూ 16 మందిని అరెస్టు చేశామని చెప్పారు. ఈ కేసులో మరి కొంతమంది నిందితులను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. వారిని పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్.ఖాదర్ బాషా ప్రత్యక్ష పర్యవేక్షణలో, తనతో పాటు టౌన్ ఇన్‌చార్జి సీఐ పి.వీరబాబు బృందం ఈ కేసును దర్యాప్తు చేస్తున్నామని అంబికా ప్రసాద్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక



విద్యార్థిని నాగమణిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కె.గంగవరం: రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినర్‌కు కె.గంగవరం ఉన్నత పాఠశాల ఎంపికైందని హెచ్ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన సైన్స్ సెమినార్‌లో జిల్లా నుంచి 65 పాఠశాలలు పాల్గొన్నాయన్నారు. అక్కడ కె.గంగవరం ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం మార్గదర్శకత్వంలో విద్యార్థి ఓరుగంటి నాగమణి ప్రదర్శించిన చిరుధాన్యాలు బలవర్థక ఆహారమా – వ్యామోహపూరిత ఆహారమా అనే అంశం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ నెల 25న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌లో ఈ విద్యార్థిని నాగమణి పాల్గొంటుందని హెచ్ఎం తెలిపారు. ఆమెను జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఫణి, సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు నాగరాజు, ఆంజనేయులు తదితరులు అభినందించారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

- జేసీ నూపుర్ అజయ్
- పి.గన్నవరంలో జగనన్నకు చెబుదాం నిర్వహణ
- 113 విజ్ఞాపనల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నూపుర్ అజయ్, ఆర్డీఓ ముక్కంటి

పి.గన్నవరం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ నూపుర్ అజయ్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి అధ్యక్షతన మండల స్థాయిలో శుక్రవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజల నుంచి 113 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్పందన వ్యవస్థ పనితీరు అర్జీదారుల్లో విశ్వసనీయతను పెంపొందించేలా ఉండాలని అధికారులకు సూచించారు. గడువు దాటిన అర్జీలు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకసారి వచ్చిన అర్జీ పునరావృతం కాకుండా పరిష్కరించాలని ఆదేశించారు. 2020 వరదల సందర్భంగా వరద బాధితులకు ఫుడ్ ప్యాకెట్లు సరఫరా చేసినందుకు రూ.7.2 లక్షలు ఇంతవరకూ ఇవ్వలేదని, తక్షణమే సొమ్ము విడుదల చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని అడ్డగళ్ల నారాయణరావు ఆందోళన చేపట్టారు. తమకూ బిల్లులు ఇవ్వాలని మరికొందరు అర్జీలు ఇవ్వడంతో, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని జేసీ హామీ ఇచ్చారు. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద గ్రామ పంచాయతీ గతంలో వర్తక సంఘానికి ఇచ్చిన ఐదు సెంట్ల భూమిని పక్కనే ఉన్న రైసు మిల్లు యజమాని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, తమ భూమిని తమకు అప్పగించాలని వర్తక సంఘ ప్రతినిధులు అర్జీ సమర్పించారు. దీనిపై స్థానిక అధికారులతో కమిటీ వేసి పరిష్కరిస్తామని జేసీ హామీ ఇచ్చారు. నరేంద్రపురంలో నిరుపయోగంగా ఉన్న ఆయుర్వేద ఆస్పత్రి భవనాన్ని పీహెచ్‌సీకి కేటాయిస్తే అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని అబ్దుల్ కలాం ట్రస్టు చైర్మన్ బీమాల వెంకటేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. పి.గన్నవరంలో డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని, గ్రామ సచివాలయ భవనాలను త్వరితగతిన పూర్తి చేసి తమకు అందించాలని సర్పంచ్ బొండాడ నాగమణి అర్జీ అందజేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి భీమేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఈఈ బి.రాము, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ ఎం.భారతి తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెపై లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/రాజానగరం: కామంతో కన్నుమిన్ను కానకుండా కన్న కూతురిపై లైంగిక దాడి చేసిన ఘటనలో ఓ తండ్రికి పదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. రాజానగరం సీఐ కాశీ విశ్వనాథ్ కథనం ప్రకారం .. నిందితుడిది రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు సంతోష్ నగర్. 2017 జూన్ ఒకటో తేదీ అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో అతడు తన పదకొండేళ్ల కుమార్తెపై లైంగిక దాడికి ఒడిగట్టాడు. కనురెప్పే కాటు వేస్తుందని ఊహించని ఆ బాలిక భయాందోళనతో గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. వెంటనే బాధిత బాలిక ఈ విషయాన్ని ఇంటి బయట నిద్రిస్తున్న అమ్మమ్మకు తెలిపింది. ఆమె వెంటనే మనవరాలిని ఆస్పత్రికి తీసుకువెళ్లి, వైద్యులకు చూపించింది. జరిగిన దారుణంపై అప్పటి రాజానగరం సీఐ కె.వరప్రసాద్‌కు ఫిర్యాదు చేసింది. పోక్సో చట్టం కింద నిందితుడిపై కేసు నమోదు చేసిన నాటి డీఎస్పీ కె.రమేష్‌బాబు ఆధ్వర్యాన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కోర్టు విచారణలో నిందితుడిపై నేర నిరూపణ జరగడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున బలమైన వాదనలు వినిపించిన పీపీ పితాని శ్రీనివాసరావును, దర్యాప్తు చేసిన నాటి ఈస్ట్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు, దిశ డీఎస్పీ కె.తిరుమలరావు, సీఐ కాశీవిశ్వనాథ్, పోక్సో కోర్టు కో ఆర్డినేటర్, దిశ సీఐ ఇ.రమణమ్మ, హెడ్ కానిస్టేబుల్ ఎం.సత్యకుమార్, కానిస్టేబుళ్లు ప్రసాద్, సతీష్‌లను జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారు. మహిళలు, చిన్నారులు పై వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.